# శిలాశాసనం..తలపిడికెడు!

అవధానుల జగన్నాథరావు & మల్లంపల్లి గాంధీరామారావు

నాగపూర్ నగరానికి తల మానిక మని చెప్పుకో వచ్చు.... ఆ ఆఫీసు భవనాన్ని. అందంగా అధునాతనంగా కట్టిన.... ఆ ఆఫీసు.... ఘనత వహించిన గవర్నమెంటు వారికి చెందినది.

మామ్మూలుగా.... నిశ్శబ్దంగా ఉండే ఆ ఆఫీసు వాతావరణంలో రెండు పెద్ద మార్పులు ఒకే రోజు జరిగి.... పెద్ద సంచలనాన్ని రేపాయి.

అందులో మొదటి మార్పు.... పదేళ్ళుగా సెక్షన్ హెడ్‌గా పని చేస్తున్న రంగనాథం గారు రిటైర్ కావడం.... రెండో మార్పు అంతవరకూ సీనియర్ క్లార్కుగా పని చేస్తున్న సుబ్బారావు సెక్షన్ హెడ్‌గా చార్జ్ హాండోవరు చేసుకోవడం.

వీడ్కోలు పార్టీతో సహా తతంగ మంతా జరిగి పోయింది. రంగనాథం గారు బహుమతిగా ఇచ్చిన కొత్త శాలువా తీసుకుని..... శేష జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో అని ఆలోచించుకుంటూ ఇంటి ముఖం పట్టారు.

అంత వరకూ, బ్రతిమాలించు కొని పని చేయడం తప్పించి తనంత తానుగా పనిచేయడం అలవాటు లేని సుబ్బారావు ... మర్నాటి నుండి.... ముష్కరుల్లాంటి ముగ్గురు ఆఫీసర్లనీ... కింకరుల్లాంటి ఇరవై మంది టైపిస్టులనీ ఎలా ఎదుర్కోవాలో అని ఆలోచించు కుంటూ..... బెంగతో ఇంటి ముఖం పట్టాడు.

* * * * *

ఉదయాన్నే.... తొమ్మిదిన్నర కల్లా... ఆఫీసుకి వచ్చిన సుబ్బారావుకి... ఎంత ఆలోచించినా అర్థం కాలేదు ఆ రంగనాథం గారు అనుక్షణం అలా ఎందుకు... నీటి నుండి బయట పడిన చేపలా కొట్టుకునే వాడో.

కాస్త ఐదు పద్థి నిముషాల ఆలస్యం మినహాయించి, రమారమిలో అందరు టైపిస్టులూ.... టైముకి వచ్చేశారు.

అన్ని సెక్షన్‌ల నుండి వచ్చిన... టైపు చేయాల్సిన కాగితాల బొండు ట్రేలో నిండు గర్భిణిలా ఉంది.

ఆ కాగితాల్ని అందరు టైపిస్టులకీ సమంగా పంచి ఈయడానికి గంట పట్టింది సుబ్బారావుకి.

ఎడ తెరిపి లేకుండా టైపు మిషన్లు చేస్తున్న చప్పుడు.... వీనుల విందుగా వినబడ సాగింది.

ఎంతో సందడిగా ప్రారంభ మైన టైప్ మిషన్ల చప్పుళ్ళలో రెండు గంటలయ్యే సరికి లయతప్పడం ప్రారంభ మయింది.

ఒంటి గంట అవడం భయం.... అందరూ పనిని ఆపు చేసి. . ఒంటి గంటన్నర ఎప్పుడవుతుంతా అని ఎదురు చూడ్డం మొదలు పెట్టారు--

సెకండ్ హాఫ్‌లో పనితో బాటు .... ఫోన్ల రొద కూడా ప్రారంభ మయింది.

కాగితం పంపించిన ప్రతి వాడికీ ... టైపు చేసిన కాగితాలు కావాలి. ప్రతి ఒక్కరి పనీ అర్జంటే. పని పూర్తయిన వారి కాగితాలు పంపించి..., అవని వారికి సర్ది చెప్పే సరికి తల ప్రాణం తోకకి వచ్చింది సుబ్బారావుకి.

సరిగ్గా నాలుగయే సరికి.... కొత్తగా జాయి నయిన నలుగురు కుర్రాళ్ళూ .... టైపు మిషన్లకి జాబ్బాలు తొడిగేశారు.... క్రికెట్ ప్రాక్టీసుకి వెళ్ళడం కోసం – లలిత, రంగారావు.... మామ్మూలుగా అడిగి ఇళ్ళలో అర్జంటు పనులుండటం వల్ల ముందుగా వెళ్ళి పోయారు.

ఆఖరు మెషిను చప్పుళ్ళు కూడా నాలుగున్నరకు ఆగిపోయింది. ఐదు గంటలయే సరికి, సుబ్బారావూ, ప్యూన్ వీరాస్వామి తప్ప, మిగిలిన వాళ్ళంతా వెళ్ళి పోయారు.

ఇంక తాళం వేసి.... యింటి మొహం పడదా మనుకున్న సుబ్బారావుకి, అరగంట క్రితం ఫోనులో వినిపించిన ఎడ్మిని స్ట్రేటివ్ ఆఫీసరు సింహ గర్జన జ్ఞాపకం వచ్చింది.

దసరా ఉత్సవాల సందర్భంగా రాజంపేట (కడపజిల్లా)లో ప్రభుత్వ సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటుచేసిన జానపద పాటల కార్యక్రమంలో పాల్గొన్న ప్రొద్దుటూరు సోదరీమణులు కుమారి ఆర్.చిత్రావతి, అరుణలని ఫొటోలో చూడవచ్చు.



"ఉదయం పదిన్నరకు, తను ఇచ్చిన కాగితాల టైపుడు కాపీలు టేబిలు మీద ఉండాలని"

పది రోజుల తర్వాత వెళ్ళ వలసిన ఆ మంత్రీ స్టేటుమెంటుకు అంత తొందర ఏమిటో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు సుబ్బారావుకు.

నీరసంగా సిగరెట్ వెలిగించి..... మిషన్ ముందు కూర్చొన్నాడు మిగిలి పోయిన రెండు పేజీల టైపింగ్ పూర్తి చేయడానికి.

* * * * *

ఆఫీసులో హోదాతో, బాటు... సుబ్బారావుకు తలనొప్పి కూడా ప్రారంభ మయింది.

కొత్త భాద్యత తీసుకొన్న.... మొదటి రెండు మూడు రోజుల్లో అంతగా గమనించలేదు.... గాని రాను రానూ తల బద్దలయే పరిస్థితి వచ్చే సరికి గత్యంతరం లేక డాక్టరు వద్దకు వెళ్ళాడు సుబ్బారావు.

డాక్టరు ఫీజులకీ, మందులకీ కలిపి మూడు వందలు ఖర్చయింది. పాత కళ్ళ జోడు స్థానంలో కొత్త కళ్ళజోడు వచ్చింది. కళ్ళ డాక్టరుతో బాటు, పళ్ళ డాక్టరు కూడా యధోచితంగా ఏభై రూపాయిలు లాగేశాడు.... రెండు పళ్ళతో కలిపి. ఇన్ని వైద్యాలు జరిగినా.... రవ్వంత కూడా గుణం కనిపించకండా, తల నొప్పి మాత్రం అలానే ఉండి పోయింది.

ఖాళీ అయిన ఆఫీసునీ, టైపు చేయవలసిన కాయితాల్నీ చూసి.... సుబ్బారావు గుండె బేజారెత్తి పోయింది.

"వీరాస్వామీ! అయ్యరు కొట్లోంచి హాఫ్ కాఫీ, నాయుడు కొట్లోంచి రెండు సారిడన్ మాత్రలూ పట్రా.... " అంటూ టైపు మిషను ముందు కూర్చొన్నాడు సుబ్బారావు.

ముఖ్యమైన కాయితాల టైపింగు పూర్తి చేసే సరికి... రాత్రి ఎనిమిదయింది.

రెండు గంటల క్రితం మింగిన సారిడన్ టాబ్లెట్లు.... ఎక్కడికి పోయాయో.... అర్థం కాలేదు సుబ్బారావుకి.... విపరీతమైన తల నొప్పి వల్ల.

తాళం వేసి బయట పడేసరికి ... జ్ఞాపకం వచ్చారు.... రిటయిర్డు సెక్షన్ హెడ్ రంగనాథం గారు. ఎన్ని పనులతో సత మత మౌతున్నా.... ఏ ఒక్క రోజు కూడా తలనొప్పి మాటిరుగని.... అయన ఆరోగ్య రహస్యం కనుక్కోవాలని పించింది.... సుబ్బారావుకి.

వెంటనే సైకిల్‌ను.... ఆయన యింటి ముఖంగా తిప్పాడు.

* * * * *

కాఫీ.... కానిచ్చిన తర్వాత అసలు విషయాన్ని బయటపెట్టాడు సుబ్బారావు.

తెలియని ఇంగ్లీషు మాటకి అర్థం .... ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలో దొరికినంత ఈజీగా.... తన తలనొప్పి పోడానికి మార్గం కనిపెట్టేశాడు... రంగనాథంగారు.

మర్నాడు ఉదయాన్నే ... ఆఫీసుకు వచ్చిన వెంటనే..... రంగనాథం గారి సలహా మేరకు మూడు లెటర్స్‌ను టైపు కొట్టాడు సుబ్బారావు.

అందులో మొదటిది –

"ఆఫీసులో కాలు పెట్టిందగ్గర నుండి... ఆఫీసు తాళం వేసే వరకూ .... యూనియన్ పనుల మీద తిరిగే అప్పారావు.... మీద చర్య తీసుకో వలసిందిగా అర్థిస్తూ ... సూపరింటెండెంట్‌కు వ్రాసిన ఉత్తరం

రెండవది....

"పాడయి పోయిన నాలుగు టైపు మిషన్లనూ. ... తిరగని మూడు ఫేన్లనీ.... వెంటనే బాగు చేయించక పోతే ఆఫీసు పని స్తంభించి పోతుందని హెచ్చరిస్తూ.... ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుకు వ్రాసిన ఉత్తరం.

మూడవది.. ..

"సప్లయి చేస్తున్న కాగితాలూ, కార్బనులూ బాగు లేక పోవడంతో టైపు మిషన్లు తరచూ పాడయి పోతున్నాయనీ.... వెంటనే కాగితాల క్వాలిటీ మార్చాలని అర్థిస్తూ స్టోర్సు ఆఫీసరుకు వ్రాసిన ఉత్తరం.

మూడు ఉత్తరాలు సంతకాలు పెట్టి.... డిస్పేచ్ చేసి వచ్చిం తర్వాత ఎంతో హాయిగా అనిపించింది సుబ్బారావుకి.

టైము చూసుకున్నాడు. సమంగా పన్నెండయింది. రోజూ మామూలుగా వచ్చే తలనొప్పి వచ్చి.... రంగనాథంగారిచ్చిన సలహాను మనసులో నిలిపింది.

'చూడు సుబ్బారావ్! తిలా దానం.. తలో పిడికెడూ అన్న ఆర్యోక్తి విన్నావా? నీవూ అదే పద్ధతి అవలంబించు. ఎంత బ్రతి మాలినా పని చేయని టైపిస్టులూ, ప్రతి కాగితాన్నీ అర్జంటు, అర్జంటు అంటూ గావు కేకలు పెట్టే ఆఫీసర్లూ.. ఈ ఇద్దరికీ మధ్య ఉండే నీలాంటి వాడికి తల నొప్పి రావడం సర్వ సామాన్యమైన విషయమే ఇలాటి పరిస్థితుల్లో, నీవు చేయ గలిగిందల్లా ఒక్కటే. నీ తల నొప్పిని... నీపై వారందరికీ సమంగా పంచి పెట్టేయ్"

ఆయన సలహా మేరకు తన సమస్యను ప్రస్తుతానికి మూడుగా విభజించి. ఉత్తరాల ద్వారా... తనకు ప్రతి రోజూ వేధించే ముగ్గురు ఆఫీసర్లకూ సమానంగా పంచేశాడు సుబ్బారావు.

ప్రతి రోజూ సాయంకాల మయ్యే సరికి .. సాధారణంగా ఆ ముగ్గురి నుండీ వినిపించే సింహ గర్జనలు.... ఆరోజు వినిపించలేదు.

ఐదున్నరకు. ... ఆఫీసు తాళం వేసి .. ఇంటి ముఖం పట్టాడు సుబ్బారావు ఈలవేసుకుంటూ. □

